


అది అతి త్వరగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ఒకటి. రెండో దశలో ఉందంటారు అధికారులు. ఇలాటి ప్రాంతాల గురించి మీకు కొంత తెలియకపోదు. అయినా కొంచెం పరిచయం చెయ్యనివ్వండి.

సాధారణంగా ఏ అటవీ ప్రాంతమో అయి ఉంటుంది. మునపట్ల ముభావ వైఖరితో నిలిచిన కొండలుంటే ఉంటాయి. ఇంజనీర్లు వెళతారు ముందు అక్కడికి. భూగర్భంలో 'బంగారం'లాటిదేదో ఉందంటారు. బొగ్గో, ఇనుమో, మరేదో—లేకపోతే ఆ స్థలం ఏ ఆనకట్ట నిర్మాణానికో అన్ని విధాలా అనుకూలమైనదంటారు. ఫలానా నది ఈ దుర్గమారణ్యాల గుండా వెళ్ళుతున్నప్పుడు చిక్కి సన్నమై సగమై ఉంటుంది గదా—దేశ ప్రజలా.

మన కథాస్థలం ఏదో పరిశ్రమకి అనుకూలంగా ఉందిట. ఈ స్థలం బీదవాళ్ళకీ, గొప్ప వాళ్ళకీ కూడా పనికొచ్చేదాన్ని ఉత్పత్తి చేస్తుందని మంత్రిగారు అన్నారుట. ఇలా అందరికీ పనికొచ్చేవి ఏం ఉన్నాయో నాకు జ్ఞాపకం రావడంలేదు. సరిగ్గా ఆ ఉత్పత్తే కాక పోయినా, దాని ఉప ఉత్పత్తు లయినా అందరికీ ఉపయోగించడం ఎరుగుదును. పెట్రోలు ధనవంతులకి పనికొస్తే, గ్యాసు వేరుసెనగకాయలూ అవీ వేచి అమ్ముకునే వాళ్ళకీ, మధ్య తరగతి సంసారాల వాళ్ళకీ ఉపయోగిస్తున్నది కదా.

ఇక్కడొక ఎరువుల ఫ్యాక్టరీ ఉంది. ఎరువులు భూస్వాములకే గదా ఉపయోగించేది? అని ఒక శాసన సభ్యుడు అడగగా, 'రైతులకి పంటలు పండితే ఆ ఉపయోగం ఎవరికి? రేపొద్దున్న తక్కువ ధరకి తిండిగింజలు కొనుక్కునే బీద ప్రజకి కాదా? అని మంత్రిగారు చమత్కరించారు. భూస్వాములని కొందరు రైతులంటారు. ఇది పట్నవాసపు వాళ్ళకంతగా తెలియక పోవచ్చును.

కథలోకి వద్దాం. ఈ ఎరువుల ఫ్యాక్టరీలో రాజయ్య ఒక పనివాడు. అతను రోజూ ఫ్యాక్టరీకి వెళ్ళుతూ నాకు కనిపించేవాడు. నాకు పొద్దున్నే షికారుగా నడవడం అలవాటు అతను దారిలో ఎదురయేవాడు.

నేను అక్కడికి రెండున్నర సంవత్సరాల కాలంలో మూడుసార్లు వెళ్ళాను. మా స్నేహితుడు అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయిపోయేక మళ్ళీ వెళ్ళలేదుగానీ, దానివల్ల మన కథకి బాధేమీ లేదు.

నేను వెళ్ళినప్పుడల్లా ఇంచు మించు వారమేసి రోజులుండే వాణ్ణి. ఆ మూడు వారాల్లోనూ నా మనస్సు మీద ముద్రవేసిన విషయాలని గుది గుచ్చి రాస్తే వచ్చే కథ ఎలా ఉంటుందంటారా వినండి.

* * *

మా స్నేహితుడు రవీంద్ర 'బి' టైపు క్వార్టరులో ఉంటున్నాడు. దానికి తగ్గ ఉద్యోగమే ఏదో చేస్తున్నాడు లెండి. 'నీ కిక్కడ చాలా బాగుందిరా, అబ్బాయ్' అన్నాను.

అతనికి భార్యా ఇద్దరు పిల్లలూ ఉన్నారు. భార్య పేరు గీత.

పిల్లలకి ఈ కథలోకి వచ్చే తీరికా, అవసరమూ ఉండదు. పొరుగూరి స్కూల్‌కి తీసుకువెళ్ళే వాన్ ఒకటి ఉంది అక్కడ. దాన్ని అందుకోవడానికి పిల్లలు ఉదయమే హడావిడి పడుతూంటారని మాత్రం నాకు తెలుసు. వాళ్ళ టిఫిన్ బాక్సులూ, స్కూల్ బాక్సులూ, బూట్ల చప్పుడూ హాలులో వినిపిస్తూంటే సినిమాలో ధ్వనులేవో జ్ఞాపకం వస్తూంటేవి— సెవెన్టీ ఎమ్. ఎమ్. స్టీరియో ఫోనిక్ సౌండ్ వగైరా సినిమాల్లోవి. ఇంకా నేను నా గదిలో ఫలహారం పూర్తి చెయ్యకుండానే వాళ్ళు తుర్రుమనేవారు. నా కొక గది, ఇంచుమించు విడిగా ఇచ్చి పట్టున్న లెవెటరీ, వాష్ బేసిన్, బాత్‌రూమ్‌లతో ఉన్నది ఏర్పాటు చేశాడు రవీంద్ర.

ఆ ఏర్పాట్లని చూసే 'నీ కిక్కడ చాలా బాగుందిరా, అబ్బాయ్' అన్నాను. 'నా కిక్కడ చాలాబాగుంది. అనకుండా' అన్న అర్థం వచ్చేలాగ.

పల్లెటూళ్ళలో ఉండి ఉండి నా సమ వయస్కులనే అబ్బాయి అనడానికి అలవాటు పడ్డాను.

'ఏం లాభం— మనుష్యులకోసం మట్టుకు వాచి పోవలసిందే' అన్నాడు రవీంద్ర.

'మంచి మంచి పూరగాయలు తెచ్చే మనుష్యులయితే మరీ వాచి పోతారు' అంటూ మాట కలిపింది గీత.

'నువ్వు నా పరువు తీసేశావు' గీతా. మా దుర్గని ఏమీ తేవద్దంటే మాత్రం వాడు వింటాడా?' అన్నాడు రవీంద్ర.

నా పేరు దుర్గా ప్రసాద్— కొంచెం ఆవకాయ తెచ్చాను.

'ఏదో ఇక్కడ దొరికే వస్తువు కాదుగదా అని ఆ పాటి తెచ్చానండి. పైగా మా శ్రీమతి పూరుకోదు. నేను చేతు లూపుకుంటూ ప్రయాణాలు చేస్తానని ఎప్పుడూ దెప్పుతూనే ఉంటుంది. ఇక్కడికొచ్చే టప్పుడయినా ఈ పాటి పట్టుకెళ్ళి తీరాలంది.'

మా భార్యాభర్తల ఆపేక్ష నేను తెచ్చిన ఆవకాయలాగే ఎంతో బాగుందని సంతోషించాడు

రవీంద్ర.

వాళ్ళింటికి ఎదురు వరసలో 'ఎన్' టైపు క్వార్టర్లు ఉన్నాయి. అవే ఇక్కడ ఆఖరి టైపు అన్న మాట.

ఒక్కటే గది ఉంటుంది. పిటి బమ్మలలో అంతగా తిరగని గృహిణికి తక్కువ స్థలంలో వసులు కోవడం, విలబడడం అలవాటుపడానికి కట్టారేమో అన్నట్టుండే వంటగది ఉంటుంది. అంతే వరండా ఉంటుంది. బాత్‌రూమ్, లేవెటరీ ఉంటాయి. చుట్టూ (అంటే మూడు వైపుల, ఒక పక్క మరో ఇల్లు ఉంటుంది) ఆవరణ ఉంటుంది.

ఆ ఇళ్ళలోని వాడే రాజయ్య. సరిగ్గా రవీంద్ర ఇంటికి ఎదురుగా గాక కాస్త ఎగువకి ఉన్నాడు.

నేను అతణ్ణి మొదట దారిలో చూశాను. తర్వాత ఒకసారి అతని ఇంటిలో నుంచి వస్తూండగా కూడా చూశాను.

పొద్దున్న ఎనిమిదింటిలోపునే చిన్న కేరియర్ ఉన్న సంచీని పూపుకుంటూ తనూ ఎక్కడికో మార్నింగ్ వాక్‌కి బయలు దేరినట్టు నిదానంగా నడుస్తూ కనిపించాడు. పొగ పీల్చి వదులుతున్నాడో, చుట్టని నములుతున్నాడో తెలియకుండా చుట్ట కాల్చేవాడు. నవ్వుతున్నాడో లేదో తెలిసేది కాదు. ముఖం, కళ్ళూ చూస్తే నవ్వుతున్నట్టు ఉండేదన్న మాట. కాకీ దుస్తులూ, బూట్లూ, తలకి బిగుతుగా పట్టిన కాకీటోపీతో రవ్యాన్ కార్మికుడిలా కనిపించేవాడు—ఆ శరీర దారుఢ్యాన్ని బట్టి, ముఖ రేఖని బట్టి.

మొదటి సారి నేను వెళ్ళినప్పుడు ఆ ప్రాంతంలో ఇంకా బస్సులూ, స్కూళ్ళూ, ఆసుపత్రులూ అలాటి వేవీ లేకున్న బాధ తప్ప మరో బాధ ఉన్నట్టు కనబడలేదు. చాకలి, మంగలి, పని వాళ్ళు, పాలవాళ్ళు, పెరుగు వాళ్ళకి బాధ లేదు. ఉప్పు, పప్పు, బియ్యం, కూరలూ నారలూ వచ్చేవి.

క్వార్టర్లు కొన్ని దివాన్ ఖానాలలా ఖాళీగా ఉండి పోయాయి. అక్కడ పనిచేసే ఆఫీసర్లే పొరుగూర్లో ఎక్కడో మకాం పెట్టుకుని ఏ జీపుల మీదో వచ్చి వెళ్తుండేవారు.

రాజయ్య చెప్పినట్టుగా, ఒక సింగిల్ రూమ్ టైప్ క్వార్టరులో అంతకన్న సింగిల్‌గా ఎవరూ లేనట్టు ఉంటూ ఉండేవాడు. అలాటి వాడి గురించి అందరికీ కావాలి. నాకూ కావలసి వచ్చింది.

ఒక సాయంకాలం ఇంటిముందు లాన్‌లో కుర్చీలు వేసుకుని కూర్చున్న సమయంలో గోధుమ గవ్వలూ, మరుగులలా ఉన్న సగ్గు బియ్యం వడియాలూ, క్రీమ్ బిస్కెట్లూ తెచ్చి పెట్టింది గీత.

'ఇన్నెందుకు?'

'ఏదీ తిన్న సంతృప్తి లేకుండా చెయ్యడానికి' అన్నాడు రవీంద్ర.

'చాల్లెండి—ఆయన నిజమే అనుకుంటారు.'

అని తినడం పూర్తయే లోపున టీలు తెచ్చింది.

టీ తాగనిచ్చి అడిగితే చెప్పాడు రవీంద్ర.

'రాజయ్యకి ఇప్పుడెవరూ లేరు. ఒకభార్య, కొడుకూ ఉండేవారు. మంత్లీ ప్రీమియమ్ చెల్లించినట్లు నెల నెలా జీతం అందగానే భార్యకి గాజులు కొంటూ ఉండేవాడు. అలాగే దగ్గిర దగ్గిర ఇరవయ్యేళ్ళు సంసారం చేశాడు ఆ మనిషితో. మరణం వచ్చే ముందే పోయింది. కొడుకు సైన్యంలో చేరి పని చేస్తున్నాడు. అతనికి పెళ్ళి చెయ్యాలని అనుకుంటూ ఉంటాడుట. ఇంకా పదేళ్ళైనా ఉంటుంది సర్వీసు, కష్ట సుఖాలు తెలిసినవా డంటారు. తాగుడు లేదు.'



కన్నులు —శ్రీ గోపాలరావు

'ఆహా' అన్నాను.

* * *

రెండోసారి వెళ్ళినప్పుడు స్కూళ్ళూ, స్కూలు బస్సులూ, షిఫ్ట్ బస్సులూ వచ్చాయి. క్వార్టర్లన్నీ నిండాయి. ఇక పాలూ మొదలయిన నిత్యావసర వస్తువులకి ఇబ్బంది ఏర్పడసాగింది.

ఒకసారి నేను వీధిలోకి వెళ్ళగానే రాజయ్య క్వార్టరు ఆవరణలో ఒక పాక కనబడింది.

గేదెని కొన్నాడేమో అనుకున్నాను. కాలనీలో కొంత ఎక్కువగానే గేదెల్ని కొంటారు.

నా వూహాజనితమైన సమాచారాన్ని ఇంటికొచ్చి రవీంద్ర భార్యకి అందజేశాను.

'కొంటే మహా బాగే' అంది సంతోషిస్తూ గీత.

ఆవేళ ఎప్పుడు భర్తతో చెప్పిందో గాని, మర్నాడు ఉదయం నాకు కాఫీ అందిస్తూ నవ్వుతూ అంది—

'అతను గేదెని కొనలేదు, కాడెద్దునీ కొనలేదుటండీ.'

ఆడవాళ్ళ మాటల మీద సంప్రదాయపు ప్రభావం ఉండడం చూస్తే నాకు జాలేస్తుంది.

'కాలేదా?' అన్నాను అక్కడికి నేనేదో విశ్వసనీయమైన వార్తని మోసుకొస్తే, ఆవిడ ఖండించినట్టు.

'లేదు. అతను ఎవరికో తనుంటున్న భాగం ఇచ్చేసి తను పాకలోకి మారిపోయాడుట. ఇప్పుడు అక్కడ అతనే ఉంటున్నాడు. ఇక్కడ ఈ మధ్య కొంతమంది క్వార్టర్లని అద్దెకిచ్చేసి ఇలా చేస్తున్నారు. అయితే ఇతను వాళ్ళలా అద్దెకివ్వలేదు. పూరికే ఇచ్చాడుట. ఇక్కడి ఇళ్ళ పరిస్థితి తెలుసుకోకుండా భార్యని వెంటబెట్టుకుని ఉద్యోగంలో జాయినవడానికి వచ్చిన ఒక గుమాస్తా గారి కిచ్చేడుట, గుమాస్తాగారంటే చిన్నవాడే లెండి. ఇరవయి వెళ్ళిన కుర్రవాడుట' అంటూ నవ్వింది.

'ఇక ఆ భార్యామణి గారికి పదిహేడు వెళ్ళాయో లేదో—అదంతా మీ స్నేహితుడు కనుక్కోలేదుటలెండి. రాజయ్య చెప్పినదేదో చెప్పాడు. ఆయన పూరికే అలా విని నే నడిగితే చెప్పారు.'

నేను కొంత ప్రత్యేకతతో మాట్లాడ గలిగినప్పుడు పూరుకునే మనిషిని కాను.

'పూర్వం అష్టవర్షా భవేత్కన్యా అనేవారు. అష్టాదశ వర్షా భవేత్ కన్యా అంటున్నారిప్పుడు. అంటున్నట్టు పద్ధెనిమిదేళ్ళకయినా పెళ్ళిచేసి పంపించాలనుకునే మనుష్యులు అక్కడక్కడ లేకపోలేదు ముఖ్యంగా పల్లెటూళ్ళలో. కూర్చున్నాటగాదు' అన్నాను కథలో ఆసక్తి కనబరుస్తూ.

గీత సిగ్గుపడుతూ కూర్చుంది. ఈనాటి సంసారం చేస్తున్న స్త్రీ సిగ్గు పడకుండా ఉండడం నేర్చుకోవాలనుకుంటుంది. కాని స్వతహా ఉన్న సిగ్గు అంతలో పోదు. ఆ మధ్యస్థ ప్రవర్తన తెలుస్తూ ఉంది గీత కదలికల్లో.

మరీ వీళ్ళు అలాటివాళ్ళే అయుంటారు. తూర్పు గోదావరి జిల్లాలో మారుమూల గ్రామంట ఆ అబ్బాయిది. పిల్లదీ అక్కడే అంతకన్న చిన్న గ్రామం. అతను కొంచెం పెద్ద కుటుంబంలోని వాడుట. విశాలమైన మండువా ఇంట్లో ఉంటాడుట. పిల్ల కన్న వారికీ చిన్న పెంకుటిల్లేదో ఉందిట. వాళ్ళిద్దరూ ఇక్కడికి రాగానే ఉండడానికి ఒక పాకైనా దొరుకుతుందేమో అని నాలుగైదు చోట్ల ప్రయత్నించారుట. లాభం లేక పోయేసరికి అతను ఆ భార్యని రైలెక్కించేద్దాం అనుకుంటూ ఉండగా అదృష్ట వశాత్తూ రాజయ్య దొరికాడు వాళ్ళకి.

తన తోటి పని వాడు ఒక్కడూ ఉంటున్నాడనీ, తను అందాకా అతని ఇంట్లో ఉండి రెండు మూడు రోజుల్లో పాక వేయించుకుంటాననీ చెప్పాడుట రాజయ్య. ఆ పాకే మా కివ్వండి అన్నాడుట ఆ కుర్రాడు పాపం.

'అందులో మీ రుండగలరుగాని, ఆడకూతు రెలా ఉండగలదు?' అని కసిరాడుట రాజయ్య— ఆడ కూతురేదో తన కూతురైనట్టు. ఇలా భావించుకుని అయినా ప్రజలు ఏదైనా సాయం చేస్తారనే దూరదృష్టితో మగపిల్లలకి వేగిరం పెళ్ళిళ్ళు చేస్తుంటారులెండి పల్లెటి దిక్కువ పెద్దవాళ్ళు.'

'ఇప్పటికీనా?' అన్నాను, ఆధునిక ప్రపంచం తప్ప ఇంకోటి ఎరగని వాడిలా.

'ఆం మరేమిటనుకున్నారు? మా పిన్నిగా రొకరు పల్లెటూర్లోనే నివాసం. వాళ్ళ కిన్ని గరిసెలు ధాన్యం వస్తాయనీ, ఇంత పాడి ఉందనీ వింటూంటే మా చిన్న తనంలో మాకు నవ్వు వచ్చేది.'

'ఇప్పుడు ఏడుపొస్తుంది. అంతే తేడా' అన్నాను నేను నవ్వుతూ.

ఆవిడ నా చిన్న తనాన్ని పరిహసిస్తున్నదానిలా నవ్వింది. కొంతసేపు ఏదో ఆలోచిస్తూ పూరుకుంది. నా మీద

జాలి అనుకుంటాను. నాది కొంచెం చిన్న ఉద్యోగం. అదీగాక నా పరిస్థితులు అంత బాగులేవు కూడా. రోజు లిలా ఉన్నాయి అన్న అర్థం వచ్చేలా మాట్లాడే నేమో వెంటనే నా మీద జాలి కలిగింది ఆమెకి. నా బాధ దేశం గురించి అయినా, ఆమె మట్టుకు నా గురించి బాధ పడింది. కొంతమంది ఆడవాళ్ళు అలా ఉంటారు.

ఆలోచనని నా మీద నించి మళ్ళించుకుని, 'మొత్తానికి తన భాగం ఆ గుమాస్తా కిచ్చేసి పాకలో మకాం పెట్టే డన్నమాట రాజయ్య. మీరు చూసేరుగా ఆ పాక?' అంది గీత.

'ఆఁ, చూశాను — మరి ఇతను అద్దె కిచ్చేడనుకుంటే నా ఆఫీసర్లు?'

'ఇతన్నెరిగిన ఆఫీసర్లు అలా అనుకోరుట. మీ స్నేహితుడుగారు చెప్పారు. వాళ్ళ దగ్గిరా మంచి అని పించు కున్నాడు.'

అంతలో రవీంద్ర రావడం చూసి లేచి నిల బడింది.

'ఏమయ్యా' అని పిలిచాను, ఇంతదాకా ఆతను చెప్పిన సంగతే ఏదో మాట్లాడుకుంటున్నాం అన్న తరహాలో.

ఈ ఇళ్ళని అద్దె కిచ్చుకోవడం చూసి ఊరుకుంటారా ఇక్కడి అధికారులు?' 'పిలిచి అడిగారు. సంజాయిషీ ఇమ్మని నోటీసు లిచ్చారు. అయితే వాళ్ళు చెప్పేది వాళ్ళు చెప్పుకున్నారు. జీతాలు చాలక తమకి కటకటగా ఉందన్నారు. అంతలా వాళ్ళు భార్యా పిల్లలతో వచ్చి ఇల్లు దొరక్క అవస్థ పడుతూ ఉంటే తప్పక ఇచ్చాం అంటారు. రెండూ నిజమే. అదీకాక వీళ్ళని కాసే అవినీతి వ శక్తైన అధికారులు కొంద రుంటారు' అన్నాడు రవీంద్ర కుర్చీలో కూర్చుంటూ.

'అఁ—అలా చెప్పు.'

'గట్టిగా అడుగుదామా అంటే వచ్చి పడుతున్న ఉద్యోగులకి వెంట వెంటనే తగినన్ని క్వార్టర్లు కట్టని తన తప్పు బయటకి వస్తుంది. ప్రభుత్వ రంగంలో కాని, ప్రైవేటు రంగంలో కాని కడుపు నింపుకుంటే కాళ్ళ మీద పడే పరిస్థితి లేని దెక్కడ?'

'సరి ఇక్కడ నీ పని ఎలా ఉందో కాని.'

కుర్చీలో తాత్త్వికుడిలా ఇబ్బంది లేకుండాకూర్చుని ఆలోచిస్తూ మాట్లాడసాగాడు రవీంద్ర 'టీటాచ్డ్ స్పిరిట్‌తో పని చెయ్యడం నేర్చుకుంటారు నాలాటి గవర్నమెంటు ఉద్యోగులు. సమానమైన హోదాల లోని వాళ్ళలోనే కొందరు అవినీతిపరులు, కొందరు బుజు ప్రవర్తన ఉన్నవాళ్ళు ఉంటారు. అందుచేత ఎక్కడా అవిధేయత, అమర్యాద, జోక్యం వనికిరావు. ఏదైనా అడిగితే జోక్యం కింద లెక్క. అభిప్రాయభేదం ఉన్నట్టు కనబడితే అమర్యాద అవుతుంది. వాళ్ళ కేదైనా చెబితే అవిధేయత అన్న మాటే. విదేశాలలో కూడా ఉండి చదువుకుని వచ్చిన వాళ్ళతో అలా ఉంటుంది. వెళ్ళని పెద్ద ఆఫీసర్లూ అంతే.

'అందరికీ క్వార్టర్లు కట్టించ కూడదా' అన బోయేను. రావని తెలిసి వూరుకున్నాను.

* * *



గొబ్బెమ్మలు
—బి. రవీంద్రనాథ్ (మాచర్లపేట)

మూడవసారి వచ్చేటప్పటికి మరో ప్లాంటుని నెలకొల్పుకున్న పరిశ్రమ ఉత్పత్తిని జోరుగా చేస్తోంది. ఇంకేవో వచ్చాయి. వాటి నలా ఉంచుదాం.

షాపుల్లో ఎక్కడలేని వస్తువులూ వచ్చి పడ్డాయి. పెద్ద పెద్ద కంపెనీల స్వంత వ్యాపలు బజారులో కొట్లకి సరుకులని అందిస్తూ కనిపించేవి.

ఆ ప్రాంతంలో జనం బాగా ఎక్కువై ఉండాలి.

'రాజయ్య ఇంకా ఆ పాకలోనే ఉంటున్నాడా' అని రవీంద్ర భార్యని అడిగాను.

'ఆఁ—ఇప్పుడు అతనికి తోడు మరో ముసలాయన కూడాను అందులో.''

'అదెవరు?'

'ఆ అబ్బాయి తండ్రే. ఇంటి దగ్గిర పరిస్థితులు తారుమారు అయెయుట. ఉన్న ఇల్లూ అదీ అమ్ముకుని, భార్యా, మిగతా పిల్లల్ని ఆవిడ అన్న తమ్ముల దగ్గిరకి పంపి తను ఈ కొడుకు దగ్గరికి వచ్చాడు. ఆ ఒక్క గదిలోనూ అతను కూడా ఎలా ఉంటాడని చెప్పి తన పాకలోనే ఒక మలక మంచం ఆయనకి వేయించాడు రాజయ్య. ఇప్పుడాయన అతనికి గురువుగా గారు కూడాను.

'ఇవన్నీ మీకెలా తెలిశాయి?'

'ఆయన మనింటికి వస్తూంటారు. ఆ అమ్మాయి ఆయన కోడలు వస్తూంటుంది.

'గురువుగారంటే ఏం చెబుతాడు?'

'వేదాంత విషయాలూ, భారత కథలూ, ఆత్మ ఉందనీ, ఆత్మ ఉంది గనక చచ్చిపోతాం అనే భయం అనవసరం అనీ, పోయిన వారి గురించి దిగులు కూడా అనవసరం అనీ—ఇలాటివే.

'జీవితం ఇలా ఉంది గనక చచ్చిపోతాం అన్న భయం అనవసరం అని చెప్పడా ఆయన?' అన్నాను నవ్వుతూ.

నవ్వింది గీత 'మీది దొంగ నిరాశావాదం కాదండీ ప్రసాద్‌గారూ? మీ స్నేహితుడు చెప్పారులెండి. ఏదో సాధించ గలమన్న ధైర్యం ఉంటే జీవితం బాగు లేదన్నట్టు మాట్లాడేవాళ్ళు కొంద రుంటారట. మీలాటి వాళ్ళు అన్నారాయన. అన్నట్టు మీరు కిందటి సారి వచ్చి వెళ్ళాక ఒక ఘోరం జరిగి పోయింది మనమండీ.'

ఏమిటది?

'రాజయ్య కొడుకు మిలిట్రీలో పని చేస్తు న్నాడు గదా. .'

'ఆఁ'

ఆత నాకసారి బీహారులో వరదలు వస్తే ప్రజలకి సాయం చెయ్యడానికి వెళ్ళిన వాళ్ళలో ఉన్నాడుట. వరదలో ఉన్న ఎవరినో రక్షించబోతూ ప్రవా హంలో కొట్టుకు పోయాడుట. పాపం, నిండా పాతికేళ్ళు లేవు.

'శాంతి సమయంలో కూడా సైనికులు పోవచ్చునని దీని అర్థం' అన్నాను మెల్లిగా నాలో నేను అనుకుంటున్నట్టు.

'ఆ కబురు తెలిశాక ఇత నెలా ఉన్నాడో చూద్దాం అని నేను మర్నాడు వీధి గుమ్మంలో నించుని చూశాను. చెబితే నమ్మరుగాని, మీ రోసారి అన్నారు చూశారా—ఎక్కడికో షికారుకి బయలుదేరినట్టు నడుస్తూ వెళతాడు. రాజయ్య పనిలోకి అని. అదుగో అలాగే కనిపించాడు మనస్సులో అంత విచారం పెట్టుకునీ నా మాటలని వినన ట్టే చెప్పుకు పోయింది రవీంద్ర భార్య.

అందుచేత కష్టాలు మనేం చూశావు అని ఆవిడగారి భావం. అవునా?' అంటూ రవీంద్ర ప్రవేశించాడు.

'మేం ఆడవాళ్ళం చూసే కష్టాలు తక్కువ అయినా చూసిన వాటి విషయంలో బాధపడడం మగాళ్ళకన్న ఎక్కువ.' అంది గీత.

'పోనీ మీలా ఉదారంగా బాధపడదామన్నా మాకంత టైము ఉండదు కదా గీతా.

'ఇప్పుడు మిమ్మల్నెవరు బాధపడ మన్నారు?' అని నవ్వుతూ లోపలికి వెళ్ళింది గీత.

* * *

రవ్వ్కారా, పెళ్ళాంగాయలూ, టీ సరంజామా వచ్చాయి.

అది రవీంద్ర ఎప్పుడూ చేయించే తమాషా. పెట్టేవని తింటూ, వాటి ధర స్థానిక హోటల్లో ఇంత అని అనే అవకాశం వీలయినంత వరకూ అతి థికి రానివ్వడు (నే నెక్కడా అననుకోండి, అది వేరే సంగతి) అంటే తను హోటల్లో దొరకనివి చేయిస్తూ ఉంటాడు.

పోనీ మనస్సులో వాటి ధరలు అనుకోవడాని కయినా, ముడి సరుకులని బట్టి వస్తువు ధర అంచనా వేసే అర్థశాస్త్ర నైపుణ్యం నా కింకా అలవడలేదు. ★

పెలవా మని *